సాక్షి
నిజామాబాద్
సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025

చంద్ర గ్రహణం సంపూర్ణం

ఆదివారం రాత్రి 9.56 గంటలకు ప్రారంభమైన చంద్రగ్రహణం అర్ధరాత్రి 1.26గంటలకు సంపూర్ణమైంది. గ్రహణ దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా తిలకిస్తూ తమ సెల్‌ఫోన్‌లలో బంధించారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



న్యూస్‌రీల్

శాంతియుతంగా వినాయక నిమజ్జనం

- సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు
- సీపీ పోతరాజు సాయిచైతన్య



ఖలీల్‌వాడి : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో గణేశ్ విగ్రహ ప్రతిష్ఠాపన, నిమజ్జన ప్రక్రియలను శాంతియుతంగా నిర్వహించిన ప్రజలకు సీపీ పోతరాజు సాయిచైతన్య ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో సుమారు 6 వేల గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి సంప్రదాయం ప్రకారం 9, 11 రోజులపాటు మండపాలలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జనం చేసినట్లు పేర్కొన్నారు. ఉమ్మెడ, బాసర బ్రిడ్జిల వద్ద నిమజ్జనం కోసం ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో సేవలందించిన రెవెన్యూ శాఖ, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, ఆబ్కారీ, అగ్నిమాపక శాఖల అధికారులు, సిబ్బందితోపాటు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, గజ ఈతగాళ్లను అభినందించారు.

ఘనంగా జెండాజాతర

- భక్తుల కోలాహలం మధ్య పులాంగ్‌కు తరలింపు
- జెండాను మోసేందుకు పోటీపడ్డ భక్తజనం





కోలాటం ఆడుతున్న భక్తులు

ఊరేగింపుగా జెండాను పులాంగ్ వైపు తీసుకెళుతున్న భక్తులు

నిజామాబాద్ రూరల్ : నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో 15 రోజులపాటు విశేష పూజలందుకున్న జెండా ఆదివారం ఉదయం భక్తజన సందోహం మధ్య పులాంగ్‌కు తరలింది. భక్తుల దాండియా, కోలాటాలు, భాజాభజంత్రీల చప్పుళ్లతో ఆలయ అర్చకులు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను మోసేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆనవాయితీ ప్రకారం వారం రోజులపాటు పులాంగ్ వద్ద ప్రతిష్ఠించిన జెండా పూజలందుకోనున్నది. అనంతరం తిరుపతికి తరలివెళ్తుంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రమోద్, కార్యనిర్వహణాధికారి వేణు పాల్గొన్నారు.

జెండా బాలాజీని దర్శించుకున్న పీసీసీ చీఫ్



జెండాకు పూజలు చేస్తున్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ జెండా బాలాజీ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఆయన వెంట పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

గుంజిళ్లతో మెదడు చురుకుదనం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): గుంజిళ్ల తీయడం అనాదిగా వస్తోన్న ఆచారమని, ఈ పద్ధతే సూపర్ బ్రెయిన్ యోగా అనే పేరిట విశ్వవ్యాప్తం అయిందని రిటైర్డ్ ప్రిన్సిపల్ అందె జీవన్‌రావు తెలిపారు. ఈ నెల 6, 7 తేదీల్లో బంగ్లాదేశ్‌లోని రాజశాహి యూనివర్సిటీలో జరిగిన అంతర్జాతీయ పరిశోధనా సదస్సులో జీవన్‌రావు పాల్గొన్నారు. 'సూపర్ బ్రెయిన్ యోగా యాజ్ ఏ పెడగాజికల్ టూల్ ఫర్ సుపీరియర్ ఇంటెలెక్ట్ అండ్ వెల్ బీయింగ్' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించి, ప్రసంగించారు. గుంజిళ్ల తీయడం ద్వారా మెదడు చురుకుదనం అవుతుందన్నారు. సూపర్ బ్రెయిన్ యోగా మేథో సంపన్నమైన, ఆరోగ్యకరమైన సమాజానికి దోహదపడుతుందని తెలిపారు.

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలను ఆదివారం నగరంలోని సుభాష్‌నగర్ డీఎస్ఎస్ స్విమ్మింగ్ పూల్ ఆవరణలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా మనోజ్‌కుమార్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా విజయ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బొబ్బిలి నగేశ్‌కుమార్, కోశాధికారిగా సతీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒలింపిక్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నరసయ్య, స్పోర్ట్స్ అథారిటీ నుంచి మీసాల ప్రశాంత్, రాష్ట్ర సంఘం నుంచి ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

చెల్లుబాటు కాని చెక్కులు

పెండింగ్‌లో బిల్లులు

- గ్రామ పంచాయతీ ఖాతాల్లోని సొమ్ము వినియోగించుకోలేని పరిస్థితి
- ఆర్థిక శాఖ నుంచి చెల్లింపులకు దక్కని అనుమతి
- ఆరు నెలలుగా ఇదే స్థితి
- రూ.కోట్లున్నా అక్కరకు రాని ఫైనం



మోర్తాడ్(బాల్కొండ): కమ్మర్‌పల్లి మండలంలోని ఒక గ్రామ పంచాయతీ ట్రెజరీ ఖాతాలో రూ.3లక్షల నిధులు ఉన్నాయి. వివిధ అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించేందుకు చెక్కులను భీమ్‌గల్ ట్రెజరీ కార్యాలయానికి పంపించారు. ఆరు నెలలు గడుస్తున్నా ఒక్క చెక్కు కూడా చెల్లుబాటు కాలేదు. ట్రెజరీ ఖాతాలో నిధులు ఉన్నా వినియోగించే పరిస్థితి లేదు. ఇదేమిటని ట్రెజరీ అధికారులను ప్రశ్నిస్తే నిధులు వినియోగించకుండా ఫ్రీజింగ్ విధించారని చెబుతున్నారు. ఇది ఒక్క కమ్మర్‌పల్లి మండలంలోని పంచాయతీ పరిస్థితే కాదు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీల ట్రెజరీ ఖాతాల్లో నిధులున్నా వినియోగించేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. పునర్విభజనకు ముందు జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక సంఘం, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇతర రకాల ఆదాయం అంతా ట్రెజరీ ఖాతాల్లోనే జమ అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా పంచాయతీల ఖాతాల్లో రూ.20 కోట్ల వరకు నిధులు ఉన్నాయి. ఈ నిధులను పంచాయతీల నిర్వహణ, చిన్నచిన్న అభివృద్ధి పనులు, సామగ్రి కొనుగోలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ట్రాక్టర్‌ల ఈఎంఐలు ఇలా ఎన్నో రకాల వాటికి వినియోగించడానికి అవకాశం ఉంది. పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం ప్రభుత్వం జమచేస్తున్న సొమ్ము చెల్లింపులకు మాత్రమే చెక్కులు చెల్లుబాటు అవుతున్నాయి. ఇతర బిల్లుల చెల్లింపులకు పంపించిన చెక్కులు ఆరు నెలల నుంచి అలాగే ఉంటున్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి బిల్లుల చెల్లింపులకు ఆమోదం లభించకపోవడంతో ట్రెజరీ కార్యాలయాలకు పంపించిన చెక్కులు అలాగే ఉండిపోయాయి. నెలల తరబడి చెక్కులు చెల్లుబాటు కాకపోవడంతో పంచాయతీల నిర్వహణ కష్టంగా ఉందని కార్యదర్శులు చెబుతున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ పంచాయతీ నిధులను వినియోగించకుండా ఫ్రీజింగ్ విధించడంతో ఖాతాల్లో నిధులు ఉన్నా అక్కరకు రావడం లేదనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ నిధుల వినియోగంపై విధించిన ఫ్రీజింగ్‌ను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

బిల్లుల కోసం పంచాయతీ చుట్టూ..

గ్రామ పంచాయతీకి నిధులు వస్తాయనే ఉద్దేశంతో ఎన్నో పనులు చేశాం. నిధులు మంజూరైన తరువాత కూడా బిల్లులు చెల్లించడం లేదు. ఆరు నెలల కింద ట్రెజరీకి పంపించిన చెక్కు ఇప్పటి వరకు డ్రా కాలేదు. ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేయాలి. నిధులు ఉన్నా ఫ్రీజింగ్ కారణంగా ఆర్థికంగా ఇబ్బంది కలుగుతోంది.

– కదారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్, సుంకెట్

జీతాల చెల్లింపులకు ఇబ్బంది లేదు

గ్రామ పంచాయతీ ట్రెజరీ ఖాతాల నుంచి సిబ్బంది జీతాల చెల్లింపునకు ఇబ్బంది లేదు. ఫ్రీజింగ్ అమలులో ఉన్న కారణంగా అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన తరువాతనే నిధులను వినియోగించడానికి వీలు ఉంటుంది.

– శివకృష్ణ, డివిజనల్ పంచాయతీ అధికారి, ఆర్మూర్

కనువిప్పు కలిగిస్తాం

- కామారెడ్డిలో రెండు లక్షల మందితో సభ నిర్వహిస్తాం
- కేంద్రంపై సమర శంఖం పూరిస్తాం
- బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించడమే లక్ష్యం
- మోదీ ఇవ్వకపోతే రాహుల్ ప్రధాని కాగానే అమలు చేస్తాం
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సమావేశంలో ప్రసంగిస్తున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు కామారెడ్డిలో ఈనెల 15న నిర్వహించే సభను విజయవంతం చేయాలని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కన్వెన్షన్ సెంటర్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి తీరుతామన్నారు. బీస్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా విద్య, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్ల అమలు కోసం తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దానికి చట్టబద్ధత ఇవ్వాల్సిన కేంద్రం మోకాలడ్డుతోందని ఆరోపించారు. బీసీ బిల్లును ఆపుతున్న వారి భరతం పట్టడానికి 15న కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు లక్షల మందితో సభ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ రోజు మోదీని పట్టుకుని బీసీ బిల్లును ఆపగలుగుతున్నారని, రాహుల్ గాంధీ ప్రధాని అవగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు.

అందరూ కృషి చేయాలి

కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభకు భారీ ఎత్తున జనం తరలివచ్చేలా పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కులగణన శాస్త్రీయంగా జరిగిందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కారుకూతలు కూసినా, ఎన్ని కుట్రలు చేసినా చిత్తశుద్ధితో బీసీ బిల్లు తీర్మానం చేశామన్నారు.

నిజాయితీగా బిల్లును ఆమోదించాం

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ఉద్దేశించిన బిల్లును నిజాయితీగా ఆమోదించామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి పంపిన బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. సామాజిక న్యాయం జరగాలనే ఉద్దేశంతో పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

అమలు చేసి తీరుతాం..

ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీ బిల్లుకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. బీసీలు పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చి ఐక్యత చాటాల్సిన అవసరం ఉందని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కార్పొరేషన్ల చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హందాన్, కాసుల బాల్‌రాజ్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఆకుల లలిత, నాయకులు అరికెల నర్సారెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సారథ్యంలో బీసీలకు న్యాయం

సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం బీసీలకు న్యాయం చేస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. కామారెడ్డిలోనే బీసీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. బీసీ బిల్లును ఆమోదించిన తర్వాత కామారెడ్డిలోనే సభ నిర్వహించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఆది శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

పాఠశాలల బలోపేతానికి కృషి అభినందనీయం



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ : రాజకీయాలతో సంబంధం లేకుండా సేవా దృక్పథంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన దయానంద్‌రెడ్డి సేవారంగంలో ఆదర్శప్రాయుడని కొనియాడారు. దయానంద్‌రెడ్డి ఉచితంగా 40 ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసిన క్రీడా సామగ్రిని ఎమ్మెల్యే ఆదివారం మండల కేంద్రంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం దయానంద్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన తనకు వియ్యంకుడు కావడం అదృష్టమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన టీ–వర్క్స్ కోసం రూ. 2.5 కోట్లతో మిషన్‌ను కొనుగోలు చేసి ఇచ్చిన గొప్ప వ్యక్తి అని అన్నారు. సంపన్నులు ఆయనను ఆదర్శంగా తీసుకుని సేవారంగంలో ముందుకు రావాలని కోరారు. తనవంటి వారు రాజకీయాల్లోకి వచ్చి చెడిపోయామని బాధపడుతున్నామని, ఎలాంటి రాజకీయాలు లేకుండా దయానంద్‌రెడ్డి మాదిరిగా సేవ చేస్తే ఎంతో సంతృప్తి ఉండేదన్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, పీడీ రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు దాసరి వెంకటేశ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు రేవంతన్న కానుక!

- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఉచితంగా 'యూనిఫాం' చీరలు
- త్వరలో పంపిణీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ వారంలోనే జిల్లాకు సరఫరా..



ప్రభుత్వం పంపిణీ చేయనున్న చీర ఇదే

మండల సమాఖ్యలు	28
గ్రామ సంఘాలు	806
మహిళా సంఘాలు	24,179
సభ్యులు	2,53,678

డొంకేశ్వర్(ఆర్మూర్) : మహిళలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా చీరలు పంపిణీ చేయనుంది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు 'రేవంతన్న' కానుక పేరుతో ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లాలో సంఘాలు.. వాటిలో సభ్యుల సంఖ్య ఎంత? ఏయే ప్రాంతాలకు సరఫరా చేయాలనే వివరాలను రాష్ట్ర అధికారులు సేకరించారు. ఈ చీరలను చేనేత, జౌళి శాఖ తయారు చేయిస్తుండగా, పలు జిల్లాలకు సరఫరా కూడా ప్రారంభమైంది. జిల్లాకు ఈ వారంలోనే చీరలు రానుండగా, వాటిని భద్రపరిచేందుకు నిజామాబాద్, బోధన్, మోర్తాడ్, పెర్కిట్, డిచ్‌పల్లిలో గోదాములను గుర్తించారు. ఆయా గోదాముల నుంచి మండలాలకు రవాణా చేసి గ్రామాల్లో పంపిణీ చేయనున్నారు. మహిళలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం త్వరలో అధికారులకు మార్గదర్శకాలు ఇవ్వనుంది. ప్రతి సభ్యురాలికి రెండు చీరలు ఇస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించగా ప్రస్తుతం ఒకటి ఇచ్చి మరొకటి తర్వాత ఇవ్వనున్నారు. అయితే.. ఈ చీర ఒకే రంగులో, ఒకే డిజైన్‌లో ఉండనుంది. ఎస్‌హెచ్‌జీ మహిళలు సమావేశాలు, కార్యక్రమాలకు వెళ్లినప్పుడు దీనినే యూనిఫాంగా వినియోగించాల్సి ఉంటుంది.

మార్గదర్శకాల ప్రకారం పంపిణీ

మహిళా సంఘాల సభ్యులందరికీ చీరలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం జిల్లా నుంచి వివరాలను సేకరించింది. జిల్లాలో ఎక్కడెక్కడికి సరఫరా చేయాలో గోదాముల వివరాలను పంపించాం. ఈ వారంలోనే జిల్లాకు చీరలు రానుండగా, ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాల ప్రకారం మహిళలకు అందజేస్తాం.

– సాయాగౌడ్, డీఆర్డీవో, నిజామాబాద్

ఆలయాల మూసివేత

- సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో..
- నేడు సంప్రోక్షణ, భక్తులకు దర్శనాలు



జెండా బాలాజీ ఆలయం

నిజామాబాద్ రూరల్ : సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆలయాలను ఆదివారం ఉదయం నుంచి మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ, దేవతలకు అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. నిజామాబాద్ నగరంలోని జెండా బాలాజీ, గోల్ హనుమాన్, నీలకంఠేశ్వరాలయం, శంభులింగేశ్వర ఆలయం, నాందేవ్‌వాడ, మాధవనగర్ సాయిబాబా ఆలయాలతోపాటు జిల్లాలోని అన్ని ఆలయాలను ఆదివారం ఉదయం 9గంటల నుంచి మూసివేశారు.



గోల్‌హనుమాన్ ఆలయం

క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



సిరికొండ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్‌ రిక్క లింబాద్రి రచించిన 'అమ్మతో అనుబంధం' పుస్తకాన్ని ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం మండలంలోని రావుట్ల గ్రామంలో ఆవిష్కరించారు. లింబాద్రి తల్లి ఇటీవల మృతి చెందగా, ఆమెకు నివాళిగా అమ్మ స్మృతిలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి, డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ మునిపల్లి సాయారెడ్డి, రిటైర్డ్‌ జడ్జి నిమ్మ నారాయణ, రిటైర్డ్‌ సీపీ జాన్‌వెస్లీ, బుద్ధవనం ప్రాజెక్టు డైరెక్టర్‌ లక్ష్మయ్య, ప్రభాకర్‌, మాలిక్‌, ఎర్రన్న, ఉమ్మాజీ నరేష్‌, బాకారం రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్‌ జిల్లా వార్షిక సమావేశం

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్‌ జిల్లా వార్షిక సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు నగరంలోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్‌ కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా డీఈవో అశోక్‌, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులందరూ హాజరుకావాలని తెలిపారు.

ఆలయాల మూసివేత



భిక్కనూరులో మూసివేసిన సిద్ధరామేశ్వరాలయం

ఎల్లారెడ్డిరూరల్‌/తాడ్వాయి/భిక్కనూరు/మాచారెడ్డి/ దోమకొండ: జిల్లాలోని పలు ఆలయాలను ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మూసివేశారు. ఈసందర్భంగా ఆలయాల కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ సోమవారం ఆలయాలను సంప్రోక్షణ చేసిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయం, మాచారెడ్డిలోని చుక్కాపూర్‌ లక్ష్మీ నరసింహస్వామి, దోమకొండలోని చాముండేశ్వరి, తాడ్వాయిలోని శబరిమాత , ఎల్లారెడ్డిలో సాయిబాబా, నీలకంఠేశ్వరాలయాలను మూసివేశారు.




చుక్కాపూర్‌ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

నిజాంసాగర్‌లోకి రికార్డు స్థాయి వరదలు

- ఈ సీజన్‌లో 125 టీఎంసీల ఇన్‌ఫ్లో
- 111.53 టీఎంసీల అవుట్‌ఫ్లో
- కొనసాగుతున్న నీటి విడుదల



ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు



నిండుకుండలా ఉన్న నిజాంసాగర్‌ ప్రాజెక్టు

నిజాంసాగర్‌: నిజాంసాగర్‌ ప్రాజెక్టులోకి ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. ఇప్పటికే 125 టీఎంసీల ఇన్‌ఫ్లో రావడం గమనార్హం . ఇంకా వర్షాకాలం మిగిలి ఉన్నందున ఇన్‌ఫ్లో రికార్డు మరింత మెరుగయ్యే అవకాశాలున్నాయి.

1920 సంవత్సరంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా కరువు కోరల్లో చిక్కుకుంది. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఉమ్మడి జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాగు నీరు లేక పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అప్పటి పాలకులు భారీ సాగు నీటి ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. ఏడాది పాటు సర్వే చేసి అచ్చంపేట– బంజపల్లి గ్రామాల మధ్య గోదావరి ఉపనదిపై సాగునీటి ప్రాజెక్టుకు అనువైన స్థలం ఉందని గుర్తించారు. 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలన్న లక్ష్యంతో 1923 సంవత్సరంలో చీఫ్‌ ఇంజినీర్‌ నవాబ్‌ అలీ నవాజ్‌ జంగ్‌ బహదూర్‌ నిజాంసాగర్‌ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. డిప్యూటీ చీఫ్‌ ఇంజినీర్‌ సీసీ పాలె, అసిస్టెంట్‌ ఇంజినీర్‌ ఎస్‌జే తారాపూర్‌ల పర్యవేక్షణలో ప్రాజెక్టు పనులు సాగాయి. 1931 సంవత్సరంలో నిర్మాణం పూర్తయ్యింది. నిజాంసాగర్‌ ప్రాజెక్టును 'ఎస్‌' ఆకారంలో 1,405.05 అడుగుల నీటిమట్టం, 30 టీఎంసీల నీరు నిలువ ఉండేలా నిర్మించారు.

ఇది రెండోసారి..

నిజాంసాగర్‌ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన తర్వాత ఈ స్థాయిలో వరద నీరు రావడం ఇదే రెండోసారి. గతంలో 1998 సంవత్సరంలో నిజాంసాగర్‌ ప్రాజెక్టుకు 167 టీఎంసీ ఇన్‌ఫ్లోగా వచ్చింది. అప్పట్లో నిజాంసాగర్‌ వరద గేట్లతో పాటు ప్రధాన కాలువ ద్వారా 157 టీఎంసీల నీటిని మంజీర నదిలోకి వదిలారు. 1998 తర్వాత ఈ ఏడాది మళ్లీ భారీ వరదలు వస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే ప్రాజెక్టులోకి 125 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు ఎగువన ఉన్న పాత మెదక్‌ జిల్లాలో వానలు దంచికొట్టడంతో రికార్డు స్థాయిలో వరదలు వచ్చాయి. గత నెల 28 న ఒకరోజులో గరిష్టంగా 2.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. అంతే స్థాయిలో 27 వరద గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలారు. ఇది ప్రాజెక్టు చరిత్రలో రికార్డుగా నిలిచింది.

మూడు వారాల్లోనే..

గత నెల 18 నుంచి నిజాంసాగర్‌ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటి విడుదల ప్రారంభమైంది. గతనెల 25న ఒక్క రోజు మాత్రమే వరద గేట్లను మూసివేశారు. ఇన్‌ఫ్లో వస్తుండడంతో నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ఈ మూడు వారాల్లోనే 111.53 టీఎంసీల నీటిని నిజాంసాగర్‌ ప్రాజెక్టు గేట్ల ద్వారా మంజీర నదిలోకి వదిలారు. ఎగువ ఉన్న సింగూరు ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల చేపట్టడంతోపాటు హల్దీవాగు, ఘనపురం ఆనకట్ట ద్వారా నిజాంసాగర్‌ ప్రాజెక్టులోకి ఆదివారం 23,220 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. దీంతో ప్రాజెక్టు 3 వరద గేట్ల ద్వారా 17,865 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు.

ఎస్సారెస్పీ నీటి విడుదల



గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

- 28,500 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో
- 8 వరద గేట్ల ద్వారా 12500 క్యూసెక్కులు అవుట్‌ ఫ్లో

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరుగుతుండటంతో శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోని ఎనిమిది వరద గేట్ల ద్వారా 12,500 క్యూసెక్కుల నీటి విడుదలను అధికారులు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఎగువ ప్రాంతాల నుంచి 28,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని, రాత్రికి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా, ఎస్సారెస్పీ వరద కాలువకు 18 వేల క్యూసెక్కుల నుంచి 19 వేల క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచారు. కాకతీయ కాలువకు 5500, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 2500, సరస్వతి కాలువకు 500, గుత్ప లిఫ్ట్‌ ద్వారా 270, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 684 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి నిండుకుండలా ఉంది.

పర్యాటకుల సందడి



ఎస్సారెస్పీ దిగువన గోదావరిలో సందడి చేస్తున్న పర్యాటకులు

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ను సందర్శించేందుకు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్‌పై ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. జిల్లాతోపాటు నిర్మల్‌, జగిత్యాల, కరీంనగర్‌, హైదరాబాద్‌ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు.

వెల్మల్‌లో ముగిసిన జెండా బాలాజీ ఉత్సవాలు



వెల్మల్‌లో జెండాను ఊరేగిస్తున్న భక్తులు

నందిపేట్‌: మండలంలోని వెల్మల్‌లో 14 రోజుల పాటు వైభవంగా కొనసాగిన జెండా బాలాజీ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. భక్తులతో మండల కేంద్రంలోని జెండా బాలాజీ ఆలయం కిటకిటలాడింది. భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయుష్‌ వైద్య శిబిరాలు

నిజామాబాద్‌నాగారం: ఆయుష్‌ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డాక్టర్‌ జె గంగాదాస్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి, 12న నందిపేట మండలం షాపూర్‌ గ్రామాల్లో శిబిరాలు ఉంటాయన్నారు. హైదరాబాద్‌ నుంచి మెడికల్‌ కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు శిబిరాల్లో పాల్గొని ప్రజలకు వైద్య సేవలందిస్తారని తెలిపారు.

మరో ఐదేళ్లు అధికారంలో మేమే..

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌ కుమార్‌ గౌడ్‌



మోస్రా రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ గౌడ్‌

వర్ని: ప్రస్తుత పదవీకాలంతోపాటు రాబోయే మరో ఐదేళ్లపాటు కాంగ్రెస్‌ పార్టీ అధికారంలో ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ పేర్కొన్నారు. మోస్రా మండల కేంద్రంలోని సీతారామ ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్నింటినీ నెరవేరుస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు రేవంత్‌ రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని వివరించారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ దోపిడీ రాజ్యానికి ప్రజలు చరమగీతం పాడారని, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అన్నివర్గాల వారికి సమన్యాయం చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, ఇదే స్ఫూర్తితో మరో ఐదేళ్లపాటు పాలన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

లిఫ్ట్‌లను వెంటనే ప్రారంభించాలి



ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డితో కుకునూర్‌ గ్రామస్తులు

వేల్పూర్‌: మండలంలోని కుకునూర్‌, నవాబు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సరఫరాను వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వేల్పూర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కుకునూర్‌ గ్రామస్తులు, నవాబు లిఫ్ట్‌ కమిటీ సభ్యులు ఆదివారం కలిసి ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సరఫరాను ప్రారంభించాలని విన్నవించారు. దీంతో ఆయన నీటి పారుదల శాఖ సీఈ మధుసూదన్‌, ఈఈ భానుప్రకాశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సీజన్‌ ప్రారంభించకముందే మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉన్నది, లేనిది చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించి నవాబు లిఫ్ట్‌ను ప్రారంభించాలన్నారు. కుకునూర్‌ లిఫ్ట్‌ మోటార్లు ఇసుకలో కూరుకుపోయినట్లు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తేగా, సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శ్రీరాంసాగర్‌లో 45 టీఎంసీల నీరున్నప్పుడే లిఫ్ట్‌ల ద్వారా చెరువులు నింపి ఉంటే ఇప్పుడు సమస్య వచ్చేది కాదన్నారు. వందల టిఎంసీల నీరు సముద్రం పాలవుతోందన్నారు. ఎస్సారెస్పీలో పూర్తి స్థాయిలో నీరున్నందున వెంటనే గుత్ప, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి లిఫ్ట్‌లు ప్రారంభించి చెరువులు నింపాలని అన్నారు. నిర్వహణ లేక వేంగంటి లిఫ్ట్‌కు సంబంధించిన కాపర్‌ కాయిల్స్‌, ఇతర సామగ్రిని దుండగులు ఎత్తుకుపోయారని, వాటికి మరమ్మతులు చేసి పల్లికొండ లిఫ్ట్‌ను కూడా ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్గుల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ 2007-08 బ్యాచ్‌ ఎస్సెస్సీ విద్యార్థులు

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు ఆదివారం 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. మిత్రులంతా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆలింగనం చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, విందులతో ఉత్సాహంగా గడిపారు.

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996–97 విద్యార్థులు ఆదివారం స్థానిక వీరభద్ర ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులంతా 28 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు.ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు.అనంతరం తమకు చదువు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీర్వాదం పొందారు. వచ్చే ఏడాది కుటుంబీకులతో కలిసి సమ్మేళనం నిర్వహించాలని తీర్మానించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి సైతం కృషిచేస్తామన్నారు.



పెద్దమల్లారెడ్డి జెడ్పీహెచ్‌ఎస్‌ 1996-97 బ్యాచ్‌ ఎస్సెస్సీ విద్యార్థులు

విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు

- నాందేడ్‌ నుంచి ప్రతి వారం అక్రమంగా రవాణా
- ఇటీవల భీమ్‌గల్‌లో విక్రేతను అరెస్టు చేసిన పోలీసులు



గంజాయి విక్రేతను అరెస్టు చేసిన భీమ్‌గల్‌ ఎక్సైజ్‌ సర్కిల్‌ అధికారులు (ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): విద్యార్థులు, యువతే లక్ష్యంగా గంజాయి వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో చదువుకోవాల్సిన విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. తమపై తల్లిదండ్రులు పెంచుకున్న ఆశలను విద్యార్థి దశలోనే తుంచివేస్తున్నారు.

రుచి చూపించి..

ఇటీవల భీమ్‌గల్‌ డిగ్రీ కళాశాల వెనుక భాగంలో గంజాయి విక్రయిస్తున్న కారెపల్లికి చెందిన బూక్యా రఘును మూడు రోజుల కింద ఎక్సైజ్‌ పోలీసులు అరెస్టు చేశారు. రఘును విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి రావడం గమనార్హం. భీమ్‌గల్‌లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదువుకుంటున్న కొందరు విద్యార్థులకు గంజాయి రుచి చూపించిన దుండగులు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని తేలింది. దాదాపు 40 మంది విద్యార్థులు కొన్ని నెలలుగా గంజాయికి బానిసలైనట్లు అధికారులు గుర్తించారు. నిందితుడు ప్రతి వారం గంజాయిని నాందేడ్‌ నుంచి తీసుకువచ్చి విద్యార్థులకు విక్రయిస్తాడని తెలిసింది. ఒక్కో ప్యాకెట్‌ను రూ.100కు తీసుకవచ్చి రూ.500లకు విక్రయిస్తుండటంతో అధిక ఆదాయం రావడంతో ప్రతి వారం తీసుకువచ్చేవాడు. అలా నాందేడ్‌కు వెళ్లినప్పుడు కనీసం 10 నుంచి 20 ప్యాకెట్‌లు తీసుకవచ్చి తన దందా కొనసాగించేవాడు. ఇదిలా ఉండగా గంజాయికి బానిసైన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను ఎక్సైజ్‌ స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్‌ నిర్వహించారు. వారిలో మార్పు రాకపోతే డీ అడిక్షన్‌ సెంటర్‌కు తప్పనిసరిగా పంపించాలని అధికారులు యోచిస్తున్నారు.

పెద్దలకు వేరే ముఠా..

పెద్దలకు గంజాయిని వేరే ముఠా సరఫరా చేస్తుండగా, వీరికి కొందరు నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గంజాయి విక్రేతలు ఎక్కడ అరెస్టు అయినా భీమ్‌గల్‌ మండలానికి చెందిన ఒక నాయకుడు అధికారులపై ఒత్తిడి తీసుకవచ్చి వారిని విడిపించడం, కేసులు నమోదు కాకుండా చూసుకోవడం చేసేవాడని సమాచారం. భీమ్‌గల్‌ ప్రాంతంలో రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే గంజాయి దందా సాగడంతో మత్తుకు అడ్డు అదుపు లేకుండా సాగిందనే వాదన వినిపిస్తోంది.

ఇప్పటికైనా అధికారులు పారదర్శకంగా విచారణ చేపట్టి గంజాయి వెనుక దాగి ఉన్న నాయకుల బండారం బయటపెడితేనే ఈ దందాకు చెక్‌ పెట్టవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

ఎంతటివారైనా వదిలిపెట్టం..

గంజాయిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరం. గంజాయి విక్రేతలపైనా, బానిసలపైనా ప్రజలు దృష్టిపెట్టి మాకు, పోలీసులకు సమాచారం అందించాలి. గంజాయి విక్రయించేవారు, వారికి మద్దతు ఇచ్చేవారు ఎంతటివారైనా వదలిపెట్టేది లేదు.

– పి. వేణుమాధవ్‌ రావు,
ఎక్సైజ్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌, భీమ్‌గల్‌

ఆపన్నహస్తం అందించండి

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ దోమకొండకు చెందిన శ్రీధర్‌
- బ్రెయిన్‌ సర్జరీ కోసం రూ.10లక్షలు అవసరం
- దాతల కోసం బాధిత కుటుంబీకుల ఎదురుచూపులు



దోమకొండ: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స కోసం సుమారు రూ.10 లక్షలు వరకు అవుతాయని వైద్యులు పేర్కొన్నారు. దీంతో బాధిత కుటుంబీకులు దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్నారు. దోమకొండకు చెందిన బలవత్రి శ్రీధర్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి శనివారం రాత్రి రామారెడ్డి నుంచి దోమకొండకు ట్రాక్టర్‌ ట్రాలీని తీసుకువస్తున్నారు. కామారెడ్డి పట్టణ శివారులోని క్యాసంపల్లి వద్ద ట్రాక్టర్‌ ట్రాలీని వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీధర్‌ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని సురారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కాగా శ్రీధర్‌కు బ్రెయిన్‌ సర్జరీ చేయాలని, ఇందుకు దాదాపు రూ. 10లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో తాము పేద కుటుంబానికి చెందిన వారిమని, తమకు రూ.10 లక్షలు ఖర్చుపెట్టుకునే స్తోమత లేదని శ్రీధర్‌ తండ్రి శ్రీనివాస్‌, తల్లి వెంకటలక్ష్మి ఆవేదన చెందుతున్నారు. తమ కుమారుడికి దాతలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. సహాయం చేయవలసిన దాతలు శ్రీధర్‌ అన్న శ్రీకాంత్‌ ఫోన్‌నెంబర్‌ 7013951924కు ఫోన్‌పే, లేదా గూగుల్‌ పే చేసి సహాయం అందించాలని కోరారు.

క్రైం కార్నర్‌

దుబాయిలో సోమారంపేట వాసి మృతి

మాచారెడ్డి: మండలంలోని సోమారంపేటకు చెందిన ఓ యువకుడు దుబాయిలో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన గూగులోతు రవి (32) మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లాడు. తన గదిలో ఆదివారం అతడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గ్రామస్తులు ద్వారా తెలిసింది. ప్రభుత్వం స్పందించి రవి మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని గ్రామస్తులు కోరారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కన్‌కల్‌ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడిచేసి పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేయగా, ఇద్దరు పరారయ్యారని ఎస్సై మురళి తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో పేకాట స్థావరంపై దాడిచేసినట్లు పేర్కొన్నారు. ఐదుగురు పేకాడుతుండగా పోలీసులు దాడి చేయగా ఇద్దరు పరారయ్యారు. మిగిలిన ముగ్గురిని పోలీసులు పట్టుకొని, వారి వద్ద ఉన్న రూ.2850 నగదు, మూడు బైక్‌లు, మూడు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

బాన్సువాడ: పట్టణంలోని కోనా బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించే పురుషోత్తం అనే ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌ తెలిపారు. పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న తారాచంద్‌కు పురుషోత్తంకు మధ్య శనివారం గొడవ జరిగింది. తారాచంద్‌ తలపై పురుషోత్తం వాటర్‌ బాటిల్‌తో కొట్టగా ఆయనకు తీవ్ర గాయమైంది. దీంతో తారాచంద్‌ బాన్సువాడ పోలీస్టేషన్‌లో పురుషోత్తంపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే తారాచంద్‌ తనను ఇష్టం వచ్చినట్లు దూషించడని పురుషోత్తం కూడా ఆయనపై పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

శోభాయాత్రలో విద్యుత్‌షాక్‌తో ఒకరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో ఆదివారం నిర్వహించిన వినాయకుడి నిమజ్జన శోభాయాత్రలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి విద్యుత్‌ షాక్‌తో గాయపడ్డాడు. రాంనగర్‌ మండప నిర్వహకులు వినాయకుడిని నిమజ్జనానికి ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లారు. హుస్నాబాద్‌కాలనీకి రాగానే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌ వైర్లు వినాయకుడికి తగిలాయి. దీంతో వినాయకుడి పక్కనే పడుకొని ఉన్న నితిన్‌ అనే వ్యక్తికి కరెంట్‌ షాక్‌ తగలంతో గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్‌ ఆస్పత్రికి తరలించారు.

ఆర్మూర్‌ గణేశ్‌ శోభాయాత్రలో ఉద్రిక్తత


- లాఠీచార్జ్‌ చేసిన పోలీసులు
- రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలిపిన యువకులు



నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున గణేష్‌ శోభాయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జ్‌ చేయడంతో గణేశ్‌ మండలి యువకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సుమారు రెండు గంటల పాటు శోభాయాత్ర నిలిచిపోయింది. వివరాలు ఇలా.. పట్టణంలోని కంఠేశ్వర యూత్‌ గణేష్‌ మండలి వద్ద ఓ పోలీసు అధికారి దురుసుగా వ్యవహరిస్తూ అసభ్య పదజాలంతో దూషించడంతో మండలి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులకు, నిర్వాహకులకు మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో పోలీసులు యూత్‌ సభ్యులపై లాఠీచార్జ్‌ చేశారు. దీంతో మండపాల నిర్వాహకులు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. మరోవైపు గణేష్‌ శోభాయత్ర సైతం నిలిచిపోవడంతో పాటు వివిధ మండపాల నిర్వాహకులు కంఠేశ్వర్‌ యూత్‌ సభ్యులకు మద్దతు తెలిపారు. అనంతరం యూత్‌ సభ్యులను పలువురు సముదాయించి శోభాయాత్రను కొనసాగే విధంగా చేశారు.

భీమ్‌గల్‌లో పోలీస్‌ వాహనం ధ్వంసం



మోర్తాడ్‌(భీమ్‌గల్‌): భీమ్‌గల్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించగా తమ వినోదానికి అడ్డు చెప్పారనే కక్షతో ముగ్గురు యువకులు పోలీసుల వాహనంపై రాళ్లు రువ్వి అద్దాలను పగులగొట్టారు. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఘటనను దృష్టిలో ఉంచుకున్న ముగ్గురు యువకులు ఆదివారం ఉదయం భీమ్‌గల్‌ పోలీసుల వాహనంపై రాళ్లు రువ్వారు. ఈ విషయమై ఎస్సై సందీప్‌ మాట్లాడుతూ.. తమ వాహనంపై రాళ్లతో దాడి చేసి తమ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.